నామినేషన్ వేయలేదు.. కోరం లేదు..

మళ్లీ వాయిదా పడిన రాయదుర్గం ఉపాధ్యక్షుడి ఎన్నిక

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం మండల ఉపాధ్యక్షుని ఎన్నికలో భాగంగా శుక్రవారం ఒక్క నామినేషన్ కూడా వేయలేదు. దీనికితోడు కోరం కూడా లేకపోవడంతో ఎన్నికల ప్రొసీడింగ్ ఆఫీసర్ రవిశంకర్‌రెడ్డి, జెడ్పీ సిఇఒకు నివేదిక పంపారు. గురువారం మాదిరిగానే శుక్రవారం కూడా ఒక సభ్యుడు (ఎంపీటీసీ) కూడా మండల పరిషత్ కార్యాలయానికి రాకపోవడంతో నివేదించినట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల దాకా మండల పరిషత్ కార్యాలయంలో ప్రొసీడింగ్ ఆఫీసర్ తో పాటు ఎంపిడి ఓ కొండయ్య, సీనియర్ అసిస్టెంట్ రవిచంద్ర ఆజాద్, తదితరులు మండల ఉపాధ్యక్షుని ఎన్నిక కోసం నిరీక్షించారు. తదుపరి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఉన్న ఎంపిటిసి సభ్యుల్లో ఒకరిని ఉపాధ్యక్షున్ని చేసేందుకు అధినాయకత్వం అనాసక్తి కనబరుస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

శ్రీసత్యసాయి కార్మికులకు

పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలను తక్షణమే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీసత్యసాయి తాగునీటి పథకం బోర్డు మీటింగ్ నిర్వహించిన నేపథ్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎమ్.గౌతమిని కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమ్‌లో 572 మంది కార్మికులు 22 సంవత్సరాలుగా పని చేస్తున్నారన్నారు. ఎల్‌టికంపెనీ పనుల నుంచి వైదొలగిన తరువాత కాంట్రాక్టర్లు మారుతూ వస్తున్నారని తెలిపారు. దీంతో పిఎఫ్ కార్మికుల ఖాతాకు చెల్లించాల్సిన పిఎఫ్ బకాయిలు 9 నెలలుగా చెల్లించలేదన్నారు. ఇఎస్ఐ 9 నెలల నుంచి కట్టడం లేదన్నారు. దీంతో కార్మికుల కుటుంబీకులు అనారోగ్యానికి గురైతే ఇఎస్ఐ క్లినిక్‌లకు వెళితే అర్హత లేదని చెబుతుండటంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. 22 సంవత్సరాలుగా కొనసాగుతున్న పిఎఫ్, గ్రాట్యూటీ, ఇఎస్ఐ, బోనస్, లీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్ సకాలంలో అందించాలన్నారు. 2 నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. మెయింటెనెన్స్‌కు సంబంధించి 22 సంవత్సరాలుగా పని చేస్తున్న మోటార్లు పాతబడి పోవడం, వాటికి రీప్లేస్ లేకపోవడంతో తాగునీటి సరఫరా పైపులైన్లు బలహీనమయ్యాయని చెప్పారు. కాలిపోయిన మోటార్లను కూడా రోజుల కొద్దీ మరమ్మతులు చేయించలేని దుస్థితి నెలకొందన్నారు. మెయింటెనెన్స్ సరిగ్గా నిర్వహించి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. 150 గ్రామాలకు 25 రోజులుగా నీరు అందకపోవడానికి కాలిపోయిన మోటార్లను రీపేరీ చేయించకపోవడంతోనే అని అన్నారు. పుట్టపర్తి ఫేజ్-2లో 86 మంది కార్మికులకు 12 నెలల పిఎఫ్ డబ్బులు ఖాతాలో జమ కాలేదన్నారు. కాంట్రాక్టర్ సలాంఖాన్ మాత్రం చెల్లించినట్లు చెబుతున్నారని, పరిశీలించి కార్మికుల ఖాతాల్లో పిఎఫ్ జమ చేయాలని కోరారు. వెంగళమ్మ చెరువు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ పంప్‌హౌస్‌లకు 2 సంవత్సరాలుగా రోడ్డు రిపేరి పేరుతో విద్యుత్ సరఫరా చేయ లేదన్నారు. దీంతో 150 గ్రామాలకు తాగునీరు అందడం లేదన్నారు. విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయకులు ఎన్.తిరుపాలు, లక్ష్మిరెడ్డి, లక్ష్మినారాయణ, నారపరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల్లో సామాజిక మార్పులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఠా కక్షలకు కేంద్రంగానున్న అనంతపురం జిల్లాలో రెండు సామాజిక తరగతుల ప్రాధాన్యత రాజకీయాల్లో కీలకంగా ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో ప్రముఖంగా కొన్ని కుటుంబాలే రాజకీయంగా ప్రభావం చూపుతూ వస్తున్నాయి. అయితే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు నియోజకవర్గ అభ్యర్థుల ఎంపికలో అనూహ్యమైన మార్పులు తీసుకొచ్చే దిశగా కసరత్తు ప్రారంభించినట్లు రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. బలమైన సామాజిక తరగతికి చెందిన ఆ ప్రభావిత కుటుంబాలకు కాదని కొత్త వారిని బరిలోకి దింపి ప్రత్యర్థి పార్టీకి అనూహ్యంగా దెబ్బకొట్టే విధంగా ఎత్తులు వేసేందుకు సమయత్తమైనట్లు కనిపిస్తోంది. కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ముందు నుంచే గ్రౌండ్‌వర్కును ఆయాపార్టీలు చేపట్టాయి. ఇప్పటికే ఆయా పార్టీల తరపున ఎన్నికల నిర్వహణకు సంబంధించి సంస్థలు పనిచేస్తున్నాయి. ఈ సంస్థలు ఆయా నియోజకవర్గాల్లోని రాజకీయ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. క్షేత్రస్థాయి నుంచి జనాభిప్రాయాన్ని సైతం తెలుసుకునే పనిలో ఉన్నాయి. ఇప్పుడున్న ఆ నియోజకవర్గ నాయకుల పనితీరును బేరీజు వేయడమే కాకుండా వారి లోపాలను పసిగడుతున్నాయి. అదే విధంగా ప్రత్యర్థి పార్టీలో అభ్యర్థుల బలం, బలహీనతలను అంచనా వేస్తున్నాయి. పై రెండింటినీ బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులను ఏ రకంగా ఎంపిక చేయాలన్నది ఎన్నికల నిర్వహణ సంస్థలు పరిశీలిస్తున్నాయి. ఇందులో భాగంగా అధికార వైసిపి అనేక మార్పులతో వచ్చే ఎన్నికల బరిలో దింగనుందన్న ప్రచారం సాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎనిమిది స్థానాల్లో సామాజిక తరగతుల్లో మార్పులు తీసుకురానున్నట్టు తెలుస్తోంది. అంటే ఇప్పటి వరకు బలమైన సామాజిక తరగతుల ముద్ర ఉన్న చోట కూడా వారిని కాదని వెనుకబడిన తరగతులకు చెందిన వారిని బరిలో దింపితే ఎలాగుంటుందన్న ఆలోచనలోనున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పులు జరుగుతున్నట్టు ఇప్పుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నేతలకు సమాచారం అందటంతో ఆ నేతల్లో గుబులు రేగుతోంది. పార్టీకి నిబద్ధులుగా ఉన్న, అన్నీ సర్వస్వంగా ఉన్న తమను ఏ రకంగా తప్పిస్తారంటూ ఆందోళన చెందుతుండటం చర్చనీయాంశం అవుతోంది. ఇప్పటికే హిందూపురంలో మహమ్మద్ ఇక్బాల్ తరపున మైనార్టీలు ఆయనకు టిక్కెట్టు ఖరారు చేయాలని ఆందోళనలు చేపట్టడం గమనార్హం. తక్కిన చోట పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉంది.

ఇక ప్రతిపక్ష టిడిపి కూడా అధికార వైసిపి ఎత్తుగడులను బట్టి ఆ పార్టీ కూడా మార్పులు, చేర్పులు చేపట్టేందుకు సమయాత్తమైంది. ఇప్పటివరకు తమకే అవకాశముంటుందని భావించిన వారిని సైతం తప్పించి కొత్త వారికి ప్రాధాన్యత కల్పించేందుకు అన్వేషణ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికలు రెండు పార్టీలకు ప్రధానమైనవి. కావున అభ్యర్థుల ఎంపికలో ఏ మాత్రం రాజీ పడే పరిస్థితులు కనిపించడం లేదు. గెలుపు గుర్రలనుకునే వారినే ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలో ఈ రకమైన రాజకీయ వేడి మొదలైంది. అభ్యర్థుల్లోనూ గుబులు రేగుతోంది. ఎవరికి అవకాశం లభిస్తుందోనన్న ఉత్కంఠత ఇప్పటి నుంచే మొదలైంది. టిక్కెట్టును దక్కించుకునేందుకు ఏ రకమైన ప్రయత్నాలు చేయాలన్న ఆలోచన లోనూ పడ్డారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

కలెక్టర్ ఎమ్.గౌతమి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో శ్రీసత్యసాయి తాగునీటి పథకం ద్వారా ప్రజలకు తాగునీరు అందించి సమస్య లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టు బోర్డు 51వ ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్ బోర్డ్ చైర్మన్ ఎమ్.గౌతమి మాట్లాడుతూ జిల్లాలో శ్రీసత్యసాయి తాగునీటి పథకం ముఖ్యమైన ప్రాజెక్ట్ అన్నారు. ప్రజల దాహార్థిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ పథకం ద్వారా జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా మోటార్ పంప్‌లు, పైపులు చెడిపోయి ఉంటే వేగవంతంగా మరమ్మతులు చేయించి నీటి సరఫరా ఆగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సక్రమంగా మెయింటెనెన్స్ చేసి శ్రీసత్యసాయి వాటర్ స్కీంకు పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా 2022-23, 2023-24వ వార్షిక జమ, ఖర్చులు, వివిధ పనులపై బోర్డు మీటింగ్‌లో అప్రూవల్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జెడ్పీ సిఇఒ భాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఇషాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాగు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు నిర్ణయించాలి

ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రైతుల సాగు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర నిర్ణయించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్కువ మద్దతు ధర కల్పించడాన్ని రైతు సంఘం జిల్లా కమిటీ వ్యతిరేకిస్తోందన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు ఉత్పత్తి ఖర్చులు కంటే తక్కువగా మద్దతు ధర ప్రకటించిన మోడీ ప్రభుత్వం రైతులకు ద్రోహం చేసిందనిఆగ్రహం వ్యక్తం చేశారు. వరికి క్వింటాల్‌కు రూ.2707లు ప్రకటించాలని, అయితే ప్రభుత్వం రూ.2,183 ల మద్దతు ధర ప్రకటించిందని విమర్శించారు. దీని వల్ల రైతులు క్వింటాలుకు రూ.524 నష్టపోతారన్నారు. అదే విధంగా వేరుశనగకు రూ. 7,411 ప్రకటించాల్సి ఉందని, కానీ ప్రభుత్వం రూ.6,377 ప్రకటించిందని అన్నారు. దీని వల్ల రైతులు క్వింటాల్‌కు రూ.1,100 నష్టపోతున్నారని తెలిపారు. మొక్కజొన్నకి రూ. 2,569 ప్రకటించాల్సి ఉండగా, ప్రభుత్వం రూ. 2,090 ప్రకటించిందన్నారు. పత్తికి రూ.8,095 ప్రకటించాల్సి ఉండగా రూ.6,620 ప్రకటించిందన్నారు. 2022-23 ధర నిర్ణయంలో నీటి పారుదల ఖర్చులు, ఎరువుల ధరలు తదితరాల పెరుగుదలను పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని ప్రభుత్వాన్ని కోరారు.

కంటింజెంట్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

డిఎంహెచ్‌ఓ వీరబ్బాయికి ఎన్జీఓ సంఘం నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం సమర్పిస్తున్న కంటింజెంట్ ఉద్యోగులు

వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కంటింజెంట్ ఉద్యోగులకు 549 జిఓ ప్రకారం నెలకు రూ.16 వేలు వేతనాలు చెల్లించాలని ఏపి ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.చంద్రశేఖర్‌రెడ్డి, బి.చంద్రమోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వీరబ్బాయిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలుగా పిఎచ్‌సి లలో కంటింజెంట్ ఉద్యోగులుగా పని చేస్తున్నారని తెలిపారు. కావున ప్రభుత్వం పెంచిన జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.జమీలా బేగం, ప్రభుత్వ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు యూ.కుళ్లాయప్ప, నాయకులు గౌస్‌పీరా, నాగభూషణం, పెద్దన్న తోపాటు కంటింన్‌జెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విత్తనపంపిణీ పరిశీలన

ఆత్మకూరు : మండలంలోని పంపనూరు ఆర్‌బికెలో చేపట్టిన వేరుశనగ విత్తనకాయల పంపిణీని వ్యవసాయ శాఖ డిఎఒ ఉమామహేశ్వరమ్మ శుక్రవారం పరిశీలించారు. ముందుగా రికార్డులతోపాటు కాయల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 15వ తేదీ వరకూ వేరుశెనగ విత్తుకోవచ్చన్నారు. కావున ఇంకా విత్తన కాయలు కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే కంది విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆర్‌బికెలో మండల అగ్రి అడ్వైజర్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ సుచరిత, ఎఇఒ సుజిత, విఎఎ శోభారాణి, వన్నూరుప్ప, వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

ఉరవకొండ : వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సూచించారు. మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో శుక్రవారం విడపనకల్ మండల కేంద్రంలో అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు సాగు చేయడానికి వ్యవసాయ పనులు నిమగ్నమయ్యారన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రి అడ్వైజరీ బోర్డు సభ్యులు జయరాములు, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, గ్రామ వ్యవసాయ, హార్టికల్చర్, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులను ప్రారంభిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి

ఒటిపిఆర్ఐ విద్యార్థులకు

తరగతి గదుల సమస్య పరిష్కారం

ఉన్నత విద్యామండలి చైరన్ కె.హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక జెఎన్‌టియు ఒటిపిఆర్ఐలోని మూడవ ఫ్లోర్‌లో నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభంతో ఫార్మసీ విద్యార్థులకు తరగతి గదుల సమస్య తీరిందని ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ముందుగా అనంతపురం నూతనంగా నిర్మించిన మూడవ ఫ్లోర్‌తోపాటు ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా రీ-మోడల్ చేసిన సైన్సు బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ బ్లాక్‌లో గణిత, రసాయన, భౌతిక శాస్త్ర విభాగాలతోపాటు ల్యాబ్‌లు, తరగతి గదులు, సెమినార్ హాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు ఉపకులపతి జి.రంగజనార్థన, రిజిస్ట్రార్, ఐసిఎస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ సి.శశిధర్, యూనివర్శిటీ ఇంజినీర్ మహమ్మద్ జహీర్ అస్లాం, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవానీ, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, బోధన, బోధనేతర సిబ్బంది, అవుట్‌సోర్సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై ఎలుగుబంటి దాడి

ప్రజాశక్తి ఆత్మకూరు

పంటపొలాల్లో ఎలుగుబంటి

మండల పరిధిలోని బి.యాలేరు గ్రామసమీపంలో శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన మహిళపై దాడి చేసింది. ఈ దాడిలో మహిళ కంటికి గాయమైంది. ఆమెను చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. గ్రామానికి చెందిన నల్లక్క అనే మహిళ శుక్రవారం ఉదయం పొలం పనుల్లోకి వెళుతున్న సమయంలో ముళ్లపొదల్లో దాగి ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా మహిళవైపు వచ్చింది. అది చూసిన ఆమె గట్టిగా కేకలు వేసింది. ఆ సమయంలో బెదిరిన ఎలుగుబంటి మహిళపై దాడి చేసింది. ఈసందర్భంగా నల్లక్క వేసిన కేకలకు అటువైపు వెళుతున్న వారు గట్టిగా కేకలు వేసుకుంటూ ఘటనాస్థలం వద్దకు వచ్చారు. జనాన్ని చూసిన ఎలుగుబంటి పారిపోయింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు, పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి ముళ్లపొదల్లో ఉన్న ఎలుగుబంటిని లోకి వెళ్లిన సమయంలో ముళ్లపొదల్లో దాగివున్న ఎలుగుబంటి ఒక్కసారిగా వలల సాయంలో బంధించారు. ఎలుగుబంటి దాడిలో గాయపడిన నల్లక్కను చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి : ట్రైనీ కలెక్టర్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వైద్యసిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ నాగజ్యోతి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలు అందించాలని ట్రైనీ కలెక్టర్ నాగజ్యోతి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని వైద్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా 9వతేదీన గర్భిణులకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల ద్వారా రిస్క్, హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్యసేవలు అందించాలన్నారు. అనంతరం కొర్రపాడు వైసిపి నాయకులు బాలనాగిరెడ్డి గర్భిణులకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీహర్ష, డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతి శుక్రవారం ఆకస్మింగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత నాడు నేడు పథకం కింద నిర్మించిన భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు కృష్ణానాయక్, కేశవర్ధన్‌రెడ్డి, పిహెచ్‌సి సూపరింటెండెంట్ రమణానాయక్, హెడ్ నర్స్ వరలక్ష్మి, ఫార్మాసిట్ ఉమా, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిముల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

జగన్ సిఎం అయ్యాక ముస్లిముల సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైసిపి అనుబంధ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా వైసిపి కార్యాలయంలో ముస్లిం నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఆధ్వర్యంలో చేపడుతున్న 'హార్ దిల్ మే వైఎస్‌ఆర్.. హమ్ సబ్ జగన్‌కే సాథ్'..ను ముస్లిముల్లోకి విస్తృతంగా తీసుకెళ్దామన్నారు. జగన్ పాదయాత్ర చేస్తున్న సమయంలో అన్నివర్గాలకు ఏదైతే మాట చెప్పారో దాని ప్రకారం పథకాలను కూడా అమలు చేస్తున్నారు. నాలుగేళ్లుగా ఎప్పుడూ రాజకీయాల కోసమో.. ఓట్ల కోసమో.. సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. జగన్ తీసుకొచ్చిన పథకాల వల్ల 98 శాతం మందికి మేలు జరుగుతోందన్నారు. అయితే కొన్ని సాంకేతిక కారణాలవల్ల రెండు శాతం మందికి లబ్ధి చేకూరడం లేదన్నారు. కాగా జగన్ అధికారంలోకి వచ్చాక ముస్లిముల అభివృద్ధి కోసం రూ.1186 కోట్లు కేటాయించారన్నారు. నగరంలో సైతం 9 మందికి కార్పొరేటర్లుగా, మేయర్‌గా, మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ వంటి అనేక పదవులు ఇచ్చామన్నారు. ముస్లిములకు వైసిపి అన్నివిధాలా మేలు చేస్తుంటే ప్రతిపక్ష టిడిపి మాత్రం ముస్లిముల వ్యతిరేక పార్టీ అయినా బిజెపితో పొత్తు పెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ చేపట్టిన పథకాలను విస్తృతంగా ముస్లిం మైనార్టీల్లోకి తీసుకువెళ్లి 2024 ఎన్నికల్లో 175 స్థానాల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, మేయర్ మహమ్మద్ వసీం, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గౌస్‌బేగ్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మునీరాబేగం, ముస్లిం మతపెద్దలు, కార్పొరేటర్లు, వైసిపి మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హార్ దిల్ మే వైఎస్ఆర్.. హమ్ సబ్ జగన్‌కే సాథ్ కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

రోడ్డుపనులు పూర్తి చేయండి : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో చేపట్టిన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ మహమ్మద్ వసీం ఆదేశించారు. నగరంలోని 38వ డివిజన్ పరిధిలోని కొవూర్‌నగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను కమిషనర్ రమణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా సిఎం జగన్ సహకారంతో నగరంలో సిమెంట్ రోడ్ల ఏర్పాటుతోపాటు డ్రెయినేజీలను ఏర్పాటు చేసి పారిశుద్ధ మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. నగరంలో నాలుగేళ్ల వైసీపీ పాలనలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు జనరల్ ఫండ్స్, గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా మంజూరైన సుమారు రూ.97.34 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. వీటితోపాటు రూ.25 కోట్ల స్పెషల్ గ్రాంట్‌ను ఉపయోగించామన్నారు. ఆయా నిధులతో నగరంలో ప్రధాన రహదారుల అభివృద్ధితోపాటు అన్ని డివిజన్ల పరిధిలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి అత్యధికంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం లక్ష్మీనగర్‌లో జరుగుతున్న పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, డిఇ రాంప్రసాద్‌రెడ్డి, ఎఇ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మేయర్ వసీం

నాటుసారా తయారీదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు

నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

తయారీదారులకు జీవనోపాధి : కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రతి గ్రామం, పల్లె నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నాటుసారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం, విక్రయించడం చట్ట రిత్యా నేరం అన్నారు. జీవనోపాధి కోసం ఇలాంటి మార్గాలను అనుసరించడం సరికాదన్నారు. అందు కోసం నాటుసారా తయారీ దారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. వాటి ద్వారా జీవనోపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ కే.శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ జి.రామకృష్ణ, డిఆర్‌డిఏ పీడీ నరసింహా రెడ్డి, ఎల్‌డిఎం సత్యరాజ్, మెప్మా పీడీ అంజత్, సెర్ప్, మెప్మా, సెబ్ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలి

'నాడు - నేడు' పనులను త్వరగా పూర్తి చేయాలి : కమిషనర్ రమణారెడ్డి

'నాడు - నేడు' పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రజలంతా బాధ్యతగా సహకరించాలని కమిషనర్ రమణారెడ్డి కోరారు. శుక్రవారం నగరంలోని పలు డివిజన్‌లలో చేపట్టిన చెత్త సేకరణ పనులను పర్యవేక్షించారు. అలాగే కార్పొరేషన్ పరిధిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పాఠశాల, శ్రీకృష్ణ దేవరాయ ఉన్నత పాఠశాలలో చేపట్టిన 'నాడు-నేడు' పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నాడు-నేడు పనులపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ విభాగ డిఇ, ఎఇలతో సమీక్షించారు. అలాగే హమాలీ కాలనీలో గడప గడపకూ ప్రభుత్వం నిధులతో నిర్మాణం చేపడుతున్న సి.సి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ప్రజారోగ్యాధికారి గంగాధర్‌రెడ్డి, ఇఇ చంద్రశేఖర్, ఎఇ బాబావలి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేరు మార్పు కొరకు

శ్రీ సత్య సాయి జిల్లా బత్తలపల్లి మండలం, యర్రాయపల్లి గ్రామం, డోర్ నెంబరు: 4-228-1, ఎస్సీ కాలనీ యందు నివాసముండు ఈదల ఈశ్వరమ్మ W/o లేట్ ఈదల గంగవరప్రసాద్ ల కుమారుడైన ఈదల యేసురత్నంను 10-06-2023 నుండి **ఈదల విజయ్ ప్రసాద్** గా పిలవడానికి మా కుటుంబ సభ్యులందరము సమ్మతించి పత్రికాముఖంగా తెలియజేయుచున్నాము కనుక ఇకమీదట నా కుమారుడైన ఈదల యేసురత్నం, ఈదల విజయ్ ప్రసాద్ గా పిలువబడుతాడు అని తెలియజేస్తున్నాము

: ఇట్లు :

కుటుంబ సభ్యులు మరియు
తల్లి ఈదల ఈశ్వరమ్మ

In the Court of the 1st Addl. Junior Civil Judge: Anantapuramu
O.S.No.783/2020

Between:
P.Narayana Swamy ...Plaintiff
V/s
B.Sivaiah (Died) by LRs
1.Lakshmidevi. B.
2.B.Naresh ...Defendants

NOTICE TO 2nd DEFENDANT

To, B.Naresh S/o Late B.Sivaiah, R/o Prasannayapalli (V), Rapthadu (M), Anantapur Dist.

పై దావా వాది, ప్రతివాదులపై బాకీ వసూలు నిమిత్తం వేసినాడు. సదరు దావా 2వ ప్రతివాది హాజరు నిమిత్తం 15-06-2023వ తేది ఉదయం 10.30 గం||లకు వాయిదా వేయదమైనది. 2వ ప్రతివాది 15-06-2023వ తేదిన స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవచ్చును. లేనిపక్షమున దావా ప్రతివాదుల పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

A.Gopi, Advocate, Ananthapuramu.

In the Court of the Junior Civil Judge: Gooty
I.A.No.372/22 in O.S.No.192/2022

Between:
C.Chinna Ankanna ...Petitioner/Plaintiff
And
C.Yogendranath ...Respondent/Defendant

NOTICE TO RESPONDANT

To, C.Yogendranath S/o C.Ramappa R/of Kondupalli Village, Peddavaduguru Mandal, Ananthapuram Dist.

పై నెంబరు కేసులో రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం 14-06-2023వ తేది ఉదయం 10.30 గం||లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

B.Jayarami Reddy
Advocate
Gooty, Cell:9440752284.

In the Court of the Junior Civil Judge: Gooty
O.S.No.192/2022

Between:
C.Chinna Ankanna ...Plaintiff
And
C.Yogendranath ...Defendant

NOTICE TO DEFENDANT

To, C.Yogendranath S/o C.Ramappa R/of Kondupalli Village, Peddavaduguru Mandal, Ananthapuram Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 14-06-2023వ తేది ఉదయం 10.30 గం||లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

బాధ్యతలు స్వీకరిస్తున్న రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వీరరాజు

రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్‌గా వీరరాజు

అనంతపురం : రోడ్డు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్‌గా వీరరాజు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి ఆర్టీవో గా విధులు నిర్వర్తించిన ఆయన ఇటీవల పదోన్నతి పై డిప్యూటీ కమిషనర్ గా పదోన్నతి పొందారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో కలెక్టర్ జాయింట్ కలెక్టర్ పలువురు జిల్లా అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. రోడ్డు భద్రత దృశ్య యావత్ సిబ్బంది ప్రజలతో సమిష్టిగా కలిసి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

బొమ్మనహాల్ : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం మండలంలోని గ్రంథాలయం లో విద్యార్థులకు విద్య, చిత్రలేఖరం, గీతాలాపన వంటి ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిటి సిఒ నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయ న్నారు. విద్యార్థుల తోపాటు తల్లిదండ్రులు సైతం శిబిరానికి రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు బాబు, ఆర్డీటీ ఉపాధ్యాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున

ప్రజాశక్తి-గుంతకల్లు

సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న శానిటరీ కార్యదర్శులు జాబ్ ఛార్ట్ ప్రకారం విధులు నిర్వహించకుండా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ వి.మల్లికార్జున హెచ్చరించారు. ధర్మవరం నుంచి బదిలీపై వచ్చిన కమిషనర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన శుక్రవారం స్థానిక కౌన్సిల్ హాలులో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో గుంతకల్లు మున్సిపాలిటీ పారిశుద్ధ్యం నిర్వహణలో రాష్ట్రస్థాయి అవార్డులు అందుకుందన్నారు. అప్పుడు కేవలం మేస్త్రీలే పారిశుధ్య కార్మికులతో పనులు చేయించేవారన్నారు. అయితే స్వర్ణాంధ్ర కోసం రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి శానిటరీ విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. వారందరూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా శానిటరీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా పద్ధతి మార్చుకుని జాబ్‌చార్ట్ ప్రకారం ఉదయం 5 గంటలకే మస్టర్ సమయానికి విధులకు హాజరుకావాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మీకేమైనా సమస్యలు ఉంటే చైర్‌పర్సన్‌తో పాటు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్, మేస్త్రీలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున

గర్భిణులు ఆరోగ్యసూత్రాలు పాటించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య సూత్రాలు పాటించాలని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేష్ నాయక్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైద్యశాలలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రారంభమైన నేపథ్యంలో కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల పిల్లలు అతిసార బారిన పడే అవకాశం ఉందన్నారు. కావున కాచి వడగొట్టిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, సీఓ భగవాన్‌దాస్, స్టాఫ్ నర్సులు సరస్వతి, సునీత, ల్యాబ్ టెక్నీషియన్ రాణి ఎస్తర్, భవానీ, భారతి, రూప హెబ్సిబా, ఎఎన్ఎంలు అనూష పద్మావతి, లలిత, సలీమా, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : గర్భిణులు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా పుడతారని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి షామీన్‌తాజ్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో 82 మంది హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు వైద్యుల సలహాలు తీసుకుని సుఖ ప్రసవం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, దిలీప్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లోకనాథ్, అరుణ కుమారి, ఆరోగ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

లింగవివక్షపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఉషారాణి ఆధ్వర్వర్యంలో లింగ వివక్షపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు సమానమే అన్నారు. కావున స్త్రీ పట్ల వివక్ష చూపకూడదన్నారు. ముఖ్యంగా భ్రూణ హత్యలను ప్రోత్సహించరాదన్నారు. కడుపులోనే ఆడ శిశు అని తెలుసుకుని అబార్షన్లకు పాల్పడితే భారత ప్రభుత్వం 1994 గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ నియంత్రణ, దుర్వినియోగ నివారణ చట్టం మేరకు శిక్షార్హులవుతారన్నారు. పుట్టబోయే బిడ్డ ఎవరని ఎవరి చెబితే మూడు సంవత్సరాలు జైలుశిక్ష, మరొకసారి చేస్తే ఐదేళ్ల జైలు శిక్ష రూ.50వేల జరిమానా, అయినా చట్టాన్ని అతిక్రమిస్తే వారి రిజిస్ట్రేషన్‌ను శాశ్వతంగా రద్దు చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బి.భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్రమణ్యం, లీగల్ అడ్వైజర్ రాణీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భారతి, ఆరోగ్య పర్యవేక్షకులు శర్మాస్‌వలి, లక్ష్మీకుమారి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజల్లోకి 'భవిష్యత్తుకు భరోసా' : టిడిపి

ప్రజాశక్తి-రాయదుర్గం

రానున్న టిడిపి పాలనలో అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూనే, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెబుతూ త్వరలో 'భవిష్యత్తుకు భరోసా' పేరుతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రి మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాయలసీమ అభివృద్ధిపై రెండు రోజుల క్రితం కడపలో యువనేత నారా లోకేష్ చేసిన డిక్లరేషన్ అంశాలను కూడా ప్రచారం చేయాలన్నారు. అరాచక పాలన ద్వారా తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న సీఎం జగన్‌ను చిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టిడిపి వస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలను నిలిపివేస్తారన్న వైసిపి నాయకుల దుష్ప్రచారానికి మినీ మేనిఫెస్టోతో చంద్రబాబు తెరదించారని చెప్పారు. దొంగఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి పరిశీలకులు పర్వీన్‌తాజ్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు రాజు, మండల కన్వీనర్లు లాలేప్ప, హనుమంతురెడ్డి, బలరామిరెడ్డి, గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మోహన్‌రెడ్డి, ధనుంజయ, కేశవరెడ్డి, ఆనంద్‌రాజ్, మారుతి, నాగరాజు, పురుషోత్తం, ఇనాయత్, సన్నన్న, కౌన్సిలర్ ప్రశాంతి, మాజీ వైస్‌ఛైర్మన్ వెంకటేశులు, మాజీ కౌన్సిలర్లు సంపత్‌కుమారి, వెంకటేశులు, సర్పంచి ఆశోక్, మల్లేషప్ప, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ పరిపాలన ప్రజలకు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మరలా ప్రజలకు తెలియజేసి రాబోవు ఎన్నికల్లో అధికారంలోకి తీసుకొచ్చేలా మద్దతు కూడబెట్టాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం టిడిపి అర్బన్ కార్యాలయంలో నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీగా అనుసరించాల్సిన కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని, ఆ మేరకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. నగరంలో టిడిపి చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేయాలన్నారు. చెరువు కట్ట రోడ్డు, సూర్యనగర్ రోడ్డు, గుత్తి రోడ్డు, హౌసింగ్ బోర్డ్, ఎన్టీఆర్ మార్గ్ తో పాటు నగరంలో రోడ్లన్నీ పూర్తి చేశామన్నారు. నగరంలోని పార్కులలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశామని, శిల్పారామంను సుందరవనంగా తీర్చిదిద్దామన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, సెంట్రల్ యూనివర్శిటీ తీసుకొచ్చామన్నారు. ఐమాక్స్ లైట్లు, నగరమంతా వెలుగులతో నింపామన్నారు. విద్యుత్ సమస్య లేకుండా తమ పరిపాలనలో చేశామన్నారు. శాంతి భద్రతల సమస్య రాకుండా 4వ పట్టణ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసి వారి మద్దతు కూడకట్టాలని, రాబోవు రోజుల్లో టిడిపి జెండా ఎగుర వేయాలని సూచించారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో హడావిడి చేసే వాళ్లు, అవసరాల కోసం వచ్చి పోయే వారు కాదని, పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు జెండా మోసి ప్రజల్లో తీసుకెళ్లే వారుగా అందరూ పని చేయాలని సూచించారు. అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించి ఎన్నికల మ్యానిఫెస్టోని ప్రతి ఇంటికి చేరవేయాలని సూచించారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబును చేసుకోవడమే లక్ష్యంగా అందరూ కలిసి కట్టుగా పని చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతికుమార్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు డిష్.నాగరాజు, తెలుగు యువత నాయకులు సుధాకర్ యాదవ్, కూచిహరి, రాష్ట్ర నాయకురాలు సంగ తేజశ్విణి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

KALYANADURGAM MUNICIPALITY
e Procurement Tender Notice

Tender Notice No.10/2022-23, 33 to 34 &39/2022-23, and 01/2023-24 to 37/2023-24 15th FC, CMDF & GGMP Funds

Name of scheme	15th FC, CMDF and GGMP Funds
No.of Works	31 Nos
Works	BT Road, Pipeline, Compound Wall, CC Roads and Drains
Total Estimated Amount	164.31 lak
Name and Address of Concerned Officer	Municipal Commissioner, Kalyanadurgam Municipality, Kalyanadurgam. (Further Details can been seen @ e-procurement Market Place at **www.tender.eprocurement.gov.in**

Tender Notice (Expression of Interest)

The Commissioner, Kalyandurgam Municipality invites sealed quotations DPR (Detail poject Report) for **Providing Infrastructure Facilities of Weaker housing Colonies in Kalyandurgam Municipality under AMRUT 2.0 State Water Action Plan.** The Interested firms having experience in the designs of Building to under take the above scope of work. The sealed quotations should reach this office along with relevant documents for above said work.

Last date of Submission of application: 17-06-2023 at 4.00 PM
Last date of Receipt of bids: 17-06-2023 at 5.00 PM
Opening of Bids: 12-06-2023 at 10.00 AM

Sd/- K.Venkatesulu
Municipal Commissioner
Kalyandurgam Municipality.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల, ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీబాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టభద్రులు అయ్యాక రైతులకు ఉపయోగకరంగా జీవన ప్రయానం సాగించాలన్నారు. అంతేగాకుండా రైతు ఆదాయాన్నిపెంచే సరికొత్త సాంకేతిక చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ పల్లె వెంకట కృష్ణకిషోర్‌రెడ్డి, రిటైర్డ్ డిజిపి శంకర్‌రెడ్డి, డాక్టర్ సహదేవరెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త, రేకులకుంట, డాక్టర్ పద్మలత, ప్రధాన శాస్త్రవేత్త, రెడ్డిపల్లి కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు

నేరాలు ఘోరాలు

చికెన్ సెంటర్‌లో చోరీ

గుత్తి : పట్టణంలోని లోకేశ్వర చికెన్ సెంటర్‌లో గురువారం రాత్రి చోరీ జరిగింది. పెద్దవడుగూరు మండలం విరూపాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు కొన్నేళ్లుగా గుత్తిలోని అనంతపురం రోడ్డులో లోకేశ్వర అనే చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి చికెన్ సెంటర్‌కు తాళాలు వేసుకుని వెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని దుండగులు చికెన్ సెంటర్‌లోకి చొరబడి గల్లా పెట్టెలో ఉన్న రూ.10 వేలు నగదును దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం చికెన్ సెంటర్ కు వచ్చి చూడగా తలుపులు తెరుచుకుని ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ద్విచక్రవాహనం చోరీ

గుత్తి : స్థానిక రైల్వేస్టేషన్ వద్ద గురువారం రాత్రి ఓ వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. స్థానిక పట్టణంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్ గా పని చేస్తున్న వెంకటేష్ పని నిమిత్తం రైల్వేస్టేషన్‌కి వెళ్లాడు. బుకింగ్ కార్యాలయం ఎదురుగా పల్సర్ బైక్‌ను పార్క్ చేసి ప్లాట్‌ఫామ్‌లోకి వెళ్లి తిరిగి వచ్చాడు. అయితే తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. సమీప ప్రాంతాల్లో గాలించిన ప్రయోజనం లేకపోవడంతో ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గుత్తి: మండలంలోని టీ.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వాణి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడేది. ఆ బాధను భరించలేక ఇంటిలో ఎవరూ లేని సమయంలో రసాయన ద్రావకం తాగి అపస్మారకస్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్ధన్

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ఆత్మకూరు : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ జనార్ధన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోతప్ప కట్ట వద్ద రైతులు, ప్రజలకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కూలీలకు తోటలకు వెళ్లినా.. ప్రయాణం చేసినా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే చిన్న చిన్న గొడవలు పడితే స్టేషన్ వద్దకు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అలాకాకుండా పెద్దగా చేసుకుని కేసుల వరకూ వెళ్లొదని సూచించారు.

టౌన్‌ప్లానింగ్ అధికారిణిగా శిరీష

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారిణి (టిపిఒ)గా పి.శిరీషా నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగర పాలకసంస్థ కమిషనర్ జి.రమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందచేశారు.

రేపు 6వ తరగతి ప్రవేశపరీక్ష

గార్లదిన్నె : ఆంధ్రప్రదేశ్ ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థులకు జూన్ 11న (ఆదివారం) నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గార్లదిన్నె మండలంలోని ఆదర్శ (మోడల్) పాఠశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ మండలంలోని ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సంబరాలు

సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

ఉరవకొండ : కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఎపి కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై శుక్రవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 'థాంక్యూ సీఎం సర్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రసాద్‌రావు, మోతీలాల్‌నాయక్, నూర్ మహమ్మద్, రమేష్‌బాబు, రాఘవేంద్ర, శ్రీనివాసులు, చంద్రన్న, సూర్య కళావతి, ఎంపిపి చందా చంద్రమ్మ, సర్పంచి లలిత, నాయకులు బసవరాజు, ఓబన్న, ఆసీఫ్, గాదిలింగ, వార్డు సభ్యులు పద్మావతి, వాసు, వసికేరి మల్లికార్జున, ఆటో సీనా, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు : ఎమ్మెల్యే పద్మావతి

శింగనమల : నియోజకవర్గానికి రూ.520 కోట్లు వరాలు కురిపించిన సిఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. శుక్రవారం అనంతపురం ఎమ్మెల్యే క్యాంపస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియెజకవర్గంలోని 45 చెరువులకు హంద్రీనీవా ద్వారా 1.35 టీఎంసీల నీటిని కేటాయించడం సంతోషకరమన్నారు. జగన్ నిర్ణయంతో నియోజకవర్గానికి నీటి కష్టాలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, వైసిపి రైతు నాయకుడు ఎన్‌వి నారాయణ, వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి వార్తకు స్పందన

గూగూడులో నిల్వ నీటిని తొలగించిన ఎస్ఐ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కుళ్లాయి స్వామి వెలిసిన గూగూడు గ్రామంలోని వీధుల్లో మోకాళ్ల లోతు నిలబడిన వర్షం నీటిని జెసిబి ద్వారా తొలగించారు. 'గూగూడులో మోకాళ్ల లోతు నీరు' అంటూ ప్రజాశక్తిలో కథనం ప్రచురితం కావడంతో ఎస్ఐ స్పందించారు. సమస్యను తెలుసుకున్న గంటల వ్యవధిలోనే నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి గూగూడుకు చేరుకుని జెసిపితో రోడ్డు పక్కనే చిన్న కాలువను ఏర్పాటు చేసి నీరు వెళ్లేలా చేశారు. దీంతో ఎస్ఐతోపాటు ప్రజాశక్తికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలులో సిఎం జగన్ తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత దక్కుతుందన్నారు. హామీల అమలులో జగన్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం సాహసోపేత నిర్ణయంగా అభివర్ణించారు. అదేవిధంగా ఉద్యోగులు

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

రోడ్డెక్కకుండా 12వ పీఆర్‌సీని అమలు చేశారన్నారు. అలాగే సీపీఎస్‌ను రద్దు చేయడంతో పాటు గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)ను అమలులోకి తేవాలని నిర్ణయించి ప్రకటించారన్నారు. వీటన్నింటితో ఎన్నికల మ్యానిఫెస్టోను పూర్తిగా అమలు చేసిన ఏకైక ప్రభుత్వం మాదేనంటూ మేం గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. ఇకపోతే ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న పంటల బీమాను తక్షణమే మంజూరు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రిని కోరామన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అదేవిధంగా రాకెట్ల వద్ద హంద్రీనీవా పై నిర్మిస్తున్న ఆమిద్యాల-రాకెట్ల లిఫ్ట్ సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు పరిహారం త్వరలోనే అందనుంద న్నారు. ఉరవకొండతోపాటు మండలంలో పెండింగ్‌లో ఉన్న ఇంటిపట్టాలకు సంబంధించి హైకోర్టు పీపీతో కూడా చర్చించామన్నారు. త్వరలోనే కోర్టులో క్లియరెన్స్ కాగానే మండలంలో దాదాపు 800 మంది లబ్ధిదారులకు స్థలాలు చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రమ్మ, సర్పంచి లలితమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, జెసిఎస్ పట్టణ కన్వీనర్ ఆసిఫ్, వార్డు సభ్యులు పద్మావతి, వాసు, వసికేరి మల్లికార్జున, నాయకులు అమర్నాథ్, ఆటో సీనా, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు గర్జన

ఉరవకొండ : జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10న ఉరవకొండలో నిర్వహించనున్న రైతు గర్జనను జయప్రదం చేయాలని సిపిఐ తాలూకా సహాయ కార్యదర్శి కురుగుంట మనోహర్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బోయ గోపాల్ పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం ఉరవకొండలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఎల్‌సి కాలువను ఆధునీకరించాలని, హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి మరొక సమాంతర కాలం నిర్మాణం చేపట్టాలని, కర్ణాటకలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న అప్పర్ భద్ర నిర్మాణ పనులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వజ్రకరూరు సిపిఐ కార్యదర్శి సుల్తాన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, నాయకులు హనుమంతు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పరీక్షలు

తలుపుల : స్థానిక పిహెచ్‌సిలో శుక్రవారం గర్భిణులకు డాక్టర్ మున్వర్ బాషా, డాక్టర్ సల్మా ప్రత్యేక పరీక్షలు చేశారు. అందులో 57 మందిని పరీక్షించగా 12 మందిలో రక్త హీనత ఉన్నట్లు గుర్తించి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్స్ ఇచ్చారు. 16 మందిని ఉచిత అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం కదిరికి పంపారు. అలాగే గర్భిణులకు ప్రసవ సమయం వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పుట్టపర్తిలో ఉపాధ్యాయుడిగా ఉన్న తలుపులకు చెందిన గంగిశెట్టి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు మొత్తం 190 మందికి ఉచితంగా పౌష్టికాహారం అందజేశారు.

గాండ్లపెంట: స్థానిక పిహెచ్‌సిలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి మహేశ్వర్ మారుతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన 44 మందికి వైద్య పరీక్షలు చేసి మెరుగైన వైద్యం కోసం 12 మందిని కదిరి ఏరియా ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. గర్భిణులకు ఐరన్, కాల్షియం మాత్రలు అందజేసి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించామ న్నారు. ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారని స్థానిక ప్రాతివి కారుణ్య కేంద్రంలో కాన్పు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగుబ్బ : కుటాగుళ్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం(నేడు) ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శుక్రవారం ఏఈ చంద్రనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ముదిగుబ్బ మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నీటిని పొదుపుగా వాడుకోండి

బత్తలపల్లి: నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్య ప్రకాష్‌బాబు, జడ్పీటీసీ కోటి సుధ సూచించారు. స్థానిక వినాయకనగర్, స్టేట్ బ్యాంకు దగ్గర, అనంతరూరల్ స్కూల్ ఏరియాల్లో ఏర్పాటు చేసిన నీటి కుళాయిలను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ నీటిని పొదుపుగా వాడుకోవాల న్నారు. కొళాయిల వద్ద ఘర్షణ వాతావరణం లేకుండా అందరూ ప్రశాంతంగా ఉండి నీటిని వాడు కోవాలని సూచించారు. గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉన్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, అందరికీ నీరందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

ప్రజలతో మాట్లాడుతున్న కోటి సూర్యప్రకాష్ బాబు, సుధ

సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా..

గోరంట్ల రూరల్: మండల పరిధిలోని కమ్మవారిపల్లి గ్రామ సచివాల యంలో ఉద్యోగులు విధులకు సరిగా హాజరుకాకపోవడంతో ప్రజలు మండిపడు తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయ వ్యవస్థని తీసుకు రాగా సిబ్బంది విధులకు సరిగా హాజరుకాకుండా ప్రజల సమస్యలను గాలికి వదిలి కుంటి సాకులు చెబుతున్నారని గ్రామస్తులు వాపోయారు. శుక్రవారం పలువురు స్థానికులు సచివాలయాన్ని సందర్శించ గా అందులో వెల్ఫేర్ అధికారి, ఎఎన్ఎం మాత్రమే విధులకు హాజరయ్యారు. 2 నెలల నుంచి డిజిటల్ అసిస్టెంట్ లీవ్‌లో వెళ్లినట్లు సమాచారం. దీంతో ఆధార్, రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం లేకుండా పోయి ందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. అలాగే విత్తన వేరుశనగ కు సంబం

కమ్మవారిపల్లి గ్రామ సచివాలయం

ధించి సంబంధిత అధికారి విధులకు సరిగా హాజరు కాకపోవడంతో సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే ప్రజలు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆయా విషయాలపై ఎంపిడిఒ రఘునాథగుప్తా, సర్పంచి మణిశివశంకర్‌రెడ్డిని వివరణ కోరగా కమ్మవారిపల్లి గ్రామ సచివాలయంలో ఇద్దరు సెలవులో వెళ్లినట్లు తెలిపారు. మిగతా సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టిడిపి మినీ మేనిఫెస్టోతో వైసిపిలో వణుకు

మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మహానాడులో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోతో వైసిపిలో వణుకు మొదలైందని, పూర్తి మేనిఫెస్టో ప్రకటిస్తే ఆపార్టీకి అభ్యర్థులు కూడా లేకుండా పోతారని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక ఉన్నం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి భవిష్యత్ భరోసాలో భాగంగా మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికీ, తాగునీరు, బీసీలకు రక్షణ చట్టం, పూర్‌టురిచ్‌లపై గ్రామాల్లో ఇంటింటా విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, కరణం రామ్మోహన్, ఉన్నం మారుతి, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయచౌదరి

గృహ నిర్మాణాలు వేగవంతంచేయాలి

ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డిఎస్ఒ వంశీకృష్ణారెడ్డి

బత్తలపల్లి : మండలంలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని డిఎస్ఒ వంశీకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో ఇంటి నిర్మాణాలను పరిశీలించి హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తహశీల్దార్ కార్యాలయ సమీపంలోని జగనన్న లేఅవుట్లో 325 మందికి ఇంటి పట్టాలు ఇవ్వగా 47 మంది గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని, 12 రూఫ్ లెవల్‌లో ఉన్నాయని, 194 బేస్‌మెంట్, 72 వాటికి పునాదులు తీసుకున్నట్లు ఏఇ వివరించారు. నిర్మాణాలు వేగంగా జరగకపోవడం పట్ల డిఎస్ఒ అసంతృప్తి వ్యక్తం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీలో వీధిలైట్ల సమస్య ఉందని లబ్ధిదారులు తెలుపగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపిడిఒ శ్రీదేవి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, సీఎస్ఓ శారద, వీఆర్ఎలు రవికాంత్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

కదిరి అర్బన్ : కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తామని అసెంబ్లీ కోఆర్డినేటర్ పిఎస్ అహ్మద్‌హుసేన్ తెలిపారు. తనను అసెంబ్లీ కోఆర్డినేట్ కమిటీ సభ్యుడిగా నియమించినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కదిరి పట్టణం మరియు రూరల్, నల్లచెరువు, తనకల్లు, నంబూల పూలకుంట , తలుపుల మండలాల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దలు, నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచె..

తొలగించిన వాహనదారులు

రొళ్ల : మండల పరిధిలోని హనుమంతనపల్లి బైలాంజనేయస్వామి ఆలయ సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా ఇనుప కంచె కోసం ఉపయోగించే ముళ్ల తంతిని వేశారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే రాత్రి 9 గంటల సమయంలో కొందరు ఆ తంతిని తొలగించారు. ఈ మార్గంలో రాత్రివేళ ఒంటరిగా వెళ్లే వాహనాదారులను దోపిడీ చేయడానికి ఈ ఆకత్యానికి పాల్పడి ఉంటారని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజుల నుంచి ఇలానే చేస్తున్నట్లు పలువురు పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్ఐ వెంకటరమణను వివరణ కోరగా వాహనదారులను భయభ్రాంతులకు గురిచేయడానికి దుండగులు ఇలా చేసి ఉంటారని, అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా బాలకృష్ణయాదవ్

కదిరి అర్బన్ : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కోఆర్డినేట్ కమిటీ సభ్యుడిగా తనను నియమించినట్లు శుక్రవారం నవ్వు బాలకృష్ణ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కదిరి అసెంబ్లీ కోఆర్డినేట్ కమిటీ సభ్యుడిగా నియామకం చేసిన ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కదిరి పట్టణంతో పాటు రూరల్, నల్లచెరువు, తనకల్లు, నంబూలపూల కుంట, తలుపుల మండలాల్లోని పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసు కుని పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.